

# ఆత్మకథ

-బి.రమణీ ప్రభాకర్



ఆంధ్రభూమి వారపత్రిక పెద్ద కథల పోటీలో
మొదటి బహుమతి పొందిన కథ


'ఆత్మనూ పరమాత్మనూ నేనే. చంపెడి
వాడూ, చంపబడెడివాడూ నేనే' అన్నా
డు భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు.
''బీదలకూ, కుంటీ గుడ్డీ అంగవిహీనులకూ సహా
యం చెయ్యి. వారు తిరిగి నీకు ప్రత్యుపకారం
చేయజాలరు. గాన ధన్యుడవగుదువు'' అన్నాడు
లూకా బైబిల్ 14వ అధ్యాయంలో.

నాకు గీత తెలుసు! మా ఇంటి యజమాని వేసవికాలం ఆరుబయట మంచం వాల్చుకుని పడుకుని, నిద్రపట్టేదాకా పారాయణ చేసేవాడు. చల్లని గాలిని నా కొమ్మలద్వారా ఆయన మీదకు వీస్తూ, నా చేతనైన సాయం నేనూ చేసేదాన్ని. నాకు బైబిల్ కంఠోపాఠం. నా నీడలో, నెత్తిమీదనుంచి కొంగులు కప్పుకుని ఆడవారూ, మగవారూ అందులోని అధ్యాయాలు చదువుతుండేవారు. నేను నిశ్శబ్దంగా వింటూ వుండేదాన్ని.

నా చెట్టు మొదలు వుండడం యజమాని ఆవరణలో వున్నా నీడని వీధిని పోయేవారందరూ వాడుకునేవారు. ఆ వీధిలో నేను తెలియనివారు లేరు. ముసిరే వానల్లో అయినా, కసిరే ఎండల్లో అయినా నేను గాంభీర్యంగా వెన్ను వంచకుండా నిలబడే వుండేదాన్ని. అక్కడ నా ఆశ్రయం పొందనివాళ్లు లేరనే చెప్పొచ్చు!

ఇప్పటి ఈ నూనూగు మీసాల కుర్రకారంతా, నా వడిలో ఆటలాడి పెరిగి పెద్దయినవారే!

భర్త అడుగులో అడుగు వేస్తూ, మునుసిగ్గుల పరదాల కనులెత్తి, నావైపు స్నేహపిచ్ఛలంగా చూస్తూ సాగిపోతున్న ఈ తరుణులు, ఈ తరువు చెంత ఆడీ, పాడీ చెలిమి చేసిన వారే! నా నీడలో గోటీబిళ్లలాడే తమ్ముళ్లనూ, బొమ్మల పెళ్లిళ్లు చేస్తే కొమ్మలనూ, భగవద్గీత చదివే పెద్దలనూ, సారా తాగి బూతులు పేలే ప్రబుద్ధులనూ, ముచ్చట్లాడుకునే అమ్మలక్కలనూ, రాజకీయాలు మాట్లాడుకునే అయ్యలనూ, అందరినీ సమదృష్టితోనే చూశాను. అందరూ 'నా'వారే అనుకున్నాను. నా సహాయం ఆశించినవారెవరినీ నిరాశ పరచలేదు.

అటువంటిది... అటువంటిది ఈనాడు... నేనెవరికీ పనికిరానట. నావల్ల అన్నీ కష్టాలేనట! నన్ను నరికేస్తేగానీ ఆ ఇంట్లో శాంతిలేదుట! ఓహ్! మానుని కాబట్టేకదా, ఇన్ని మాటలు పడీ, ఇంకా ఇలా దిక్కుమాలిన మొహం వేసుకుని వాకిట్లో నిలబడే వున్నాను.

ఆ ఇంట్లో జరిగిన ప్రతి సంబరానికీ, వేడుకలకీ, విషాదాలకీ, వివాదాలకీ సాక్షీభూతంగా పాతికేళ్లు గడిపాను. నేను చెప్పుకోకూడదుకానీ వింతగా గౌరవించేవారనీ,

"మా కల్పవృక్షం వుండగా మాకు గాలికీ, ఆరోగ్యానికీ ఏం లోటోయ్" అనేవాడు యజమాని. దంతధావనానికి పుల్లలు విరుస్తూ.

"నాలుగు వేప రెమ్మలిద్దురూ పిల్లలకి అమ్మవారి జ్వరం వచ్చింది" అంటూ ఎందరు కన్నతల్లులు ఆతృతగా పరుగెత్తుకొచ్చేవారనీ!

ప్రతివాళ్లకీ సాయం చేసేదాన్ని. వారి కష్టం నాదేన్నట్లు మనసు కొట్టుకుపోయేది.

వీధి చివరమున్న సిగరెట్ ఫ్యాక్టరీలో పనిచేసే 'వర్కర్లు' నా నీడనే భోజనాలు చేసేవారు. అలసి సొలసిన బాటసార్లు సౌఖ్యాలు రుచిచూపించేదాన్ని.

"మొదటి సందులోకి మరలగానే, పెద్ద వేపచెట్టు వుంటుంది. అదే మా ఇల్లు" అని గుర్తులు చెప్తుంటే గర్వంతో

నా మేను పులకరించిపోయేది.

అదిగో! ఇంటాయన తల్లి. ఇప్పుడంటే డెబ్బై ఏళ్లు పైబడి వడలిపోయిందిగానీ నా చిన్నతనాన నన్నెంత ముద్దుగా చూసేదనీ! తెల్లని బట్ట పరిచి, దానిమీద రాలిన వేపపూవు ఏరి, పిల్లలకి ఉప్పుకారం వేసి వేయించి పెడ్తూ, "వేపతల్లి చేసిన మేలు ఎవరూ చేయరురా!" అనేది. అసలు నా పళ్లు చప్పరించని పిల్లలేరి ఆ వీధిలో!

ఇంటి యజమాని కూతురంటే నాకు ప్రాణం! ఇప్పుడు అసలు బైటికే రావడం మానేసింది. నా చూపే తనమీద పడకూడదన్నట్లు కిటికీ తలుపులు సైతం బిడాయించేసుకుంటోంది.

బెత్తం పట్టుకుని నాతో పంతులమ్మ ఆటలు ఆడీ, నాతో తన కలతలూ, కలలూ అన్నీ కలబోసుకున్న కన్నెపిల్ల. ఈవేళ కన్నతల్లిగా మారి, పండంటి బిడ్డని ఎత్తుకుని వచ్చింది!

నా ప్రాణం కొట్టుకుపోతోంది. ఒక్కసారి కళ్లారా చూడాలనీ, స్నేహంగా ఆ వంటిని నిమరాలనీ, ప్చ్! లాభం లేదు. అసలు నేనుంటేనే తనా ఇంట్లో వుండనని పంతం పట్టేసింది.

ఆ ఇంటివారి అబ్బాయి 'బాబు'కి దూరదేశంలో ఎక్కడో ఉద్యోగం. ఏడాదికి ఒక్కసారి వస్తాడు. ఉన్నంత కాలం ఎక్కువగా నాతోనే గడిపేవాడు. అతనుంటే నా బాధ అర్థం చేసుకునేవాడేమో?

"బారసాలలకీ, శ్రీమంతాలకీ, వడుగులకీ, పెళ్లిళ్లకీ ఒక్క కార్యానికి కూడా వంటచెరకు కోసం, ఒక్క పేదు కొనెరగం! పందిరి వేయించకపోయినా నీ ఇంటిముందు ఎంత చల్లదనం అంటూ పొగిడేవారు" అంటూ ముక్కు చీది, కంట తడిపెడ్తోంది వసారాలో బామ్మగారు.

## రేటు



"వంద రూపాయలు పందెం కడితే ఆ అమ్మాయిని ముద్దుపెట్టుకుంటా!"

"యాభై రూపాయలు పందెం. మరి.. ముద్దు పెట్టుకో"

"లాభంలేదు... ఆ అమ్మాయి రేటు వంద రూపాయలు... రేటు తగ్గదు!"

"ఆ...!"

— సాయిగంగాధర్ చామర్తి (విజయవాడ)

''ఏం చేద్దాం మరి! అల్లుడు ససేమిరా అంటున్నాడు. ఆ గాలి తగిలితేనే పసివాడికి వళ్లంతా దురదలూ, దద్దుర్లూనాయె'' అంటున్నాడు యజమాని ఆమెకి నచ్చచెప్తూ.

నా వళ్లు సిగ్గుతో చచ్చిపోయినట్లయింది. ఇంతకంటే అవమానం ఏముందీ? నావల్ల వాళ్లకి ఉపకారంకన్నా అపకారమే హెచ్చుగా వుందట!

ఆ ఇంటి పిల్లల్ని, కన్నతల్లి లేని లోటు తెలియకూడదన్నట్లు లాలించాను. నాకు ఉయ్యాల వేసి వూగుతుంటే, మాతృత్వం సిద్ధించినట్లు పులకించిపోయేదాన్ని.

''కుహూ! కుహూ!'' అంటూ కోకిలమ్మని ఓ(టేస్తున్న పిల్లతో చేరి, నేనూ పిల్లనై ఆనందంతో ఊగిపోయేదాన్ని.

కాకి ఐనా, కోకిలైనా ఒకటిగానే చూశాను! ఈ రోజున అందరూ నన్నో నేరస్తురాల్లా చూస్తున్నారు. చేయని అపరాధానికి నేను నాలో నేనే కుంచించుకుపోతున్నాను. నిజానికి, జరిగిన దానికి నేనెంతమా(తం బాధ్యురాలిని కాదు!

జరిగిన విషయం విని మీరే చెపండి! నా తప్పేమిటో!

(పతిరోజూ ఎన్నో పకులు వచ్చేవి, వెళ్లేవీ, తమ తియ్యని గొంతులతో, అందమైన రూపులతో నాకేగాక చుట్టుపట్లవారికీ ఆనందాన్ని కలగజేసేవి.

అలాగే ఓ రోజున ఓ పక్షి వచ్చి నా కొమ్మపై వాలింది. దాని తోక ఎరుపు! ముక్కు ఎరుపు! ముక్కున కరుచుకొచ్చిన గింజకూడా ఎరుపే! దాని చక్కదనాన్ని చూసి నేను మక్కువపడ్డాను. అది వెళ్లిపోతూ, వెళ్లిపోతూ ఆ గింజ అక్కడే మరిచిపోయి వెళ్లిపోయింది! నేనా విషయం పట్టించుకోలేదు.

నిర్లక్ష్యం అజ్ఞానంకంటే భయంకరమైనది!

ఆ గింజలోంచి ఒక మొలక బైటికొచ్చింది. అదే 'బదనిక! దీని ఎ(రని చిగురు 'మంట విత్తనం'లా నాకు గోచరించింది. అది చూసి ముచ్చట పడ్డానేకానీ, ఇలా అది నా (బతుకు చివరంటూ కాల్చేస్తుంది ఆనాడు ఊహించలేదు.

సోమరితనం నయవంచనకు మారుపేరు! ఆ మొలకెత్తిన మొక్క ఒక పరాన్నభుక్కు! నన్ను ఊపిరి ఆడనివ్వకుండా కౌగిలించుకుంది. ఆ తమకంలో నేనుండగా నన్ను నెమ్మది నెమ్మదిగా, మొత్తంగా ఆ(కమించుకుంది. నామీద ఆహారానికీ, నీటికీ ఆధారపడికూడా నన్ను తన అధీనంలోకి తీసుకుని నొక్కేసింది. నా సహజ లక్షణాలైన మంచి గాలినీ, సువాసనని, ఆరోగ్యాన్ని అన్నిటినీ పీల్చి పిప్పిచేసింది.

ఆకుపచ్చ చివర్లుకల ఎ(రని గుత్తులు గుత్తుల పూలతో చిన్న చిన్న ఎ(రని పండ్లతో చూడడానికి అది ముచ్చట గొలిపేది! కానీ, దాని వేషాలు నాకు వెలపరం కలిగించడం మొదలుపెట్టాయి. పురుగులతో చెలిమి చేసింది. వాటి 'నూగు' గాలిద్వారా వ్యాపింపజేసి, మానవులు దురదలతో బాధపడుతుంటే విరగబడి నవ్వేది!

''ఇది ఏమిటి'' అని అడగబోతే నా నోరు నొక్కేది.

'దుర్జన సాంగత్యం' మింగిన మహాపాపం

లేదు కదా! అందుకే. నాకు తగిన శిక్ష పడింది. నాకూ ఆ పురుగులు పట్టాయి. వాటిని చూస్తేనే నాకు అసహ్యం. 'గొంగళీ పురుగులు!'


పిల్లలు నా దగ్గరకు రావడం మానేసారు. నాతో ఆటలు ఆడడం మానేశారు. నన్ను చూస్తేనే ఓ దయ్యాన్ని చూసి ఝడుసుకున్నట్లు చేసి పారిపోతున్నారు.

నేను ఎన్నోసార్లు ఆత్మహత్య చేసుకుందామనుకున్నాను. ఆ వరం మాకు భగవంతుడు ఇవ్వలేదు కాబట్టి మోడు బ్రతుకు ఈడ్చసాగాను. ఇంతలో, ఇంటివారే నన్ను నరికించెయ్యాలన్న నిర్ణయం తీసుకున్నారు. నాకు ఒకవైపు ఆనందంగానే అనిపించింది. ''నాతోబాటు ఈ వెన్నెల 'బదనిక' కూడా నాశనమైపోతుందిగా'' అని. అంతలోనే నా చిలవలలో పలవలలో వలపుల గూడ్లు కట్టుకుని అమాయకపు మూగజీవాల్ని తలుచుకుని, గుండె పగిలి పోయింది.

పాతికేళ్లు పట్టింది నేను ఇంత పెద్దగా, విశాలంగా ఎదిగి, వీధి వీధంతా నీడను పరచడానికి! నన్ను ఓ రెండు గంటలు శ్రమపడి నరికేస్తారు సరే! కానీ, ఈ అజ్ఞానులు మరో మొక్కని ఎక్కడా ఈ దరిదాపుల్లో నాటలేదే! ఇంకో పదేళ్ల తరువాతైనా, తరువాత తరంవారికి నీడను కల్పించడానికి! బొత్తిగా ముందుచూపులేని ఈ బుద్ధిమాంద్యులు ఎలా బ్రతుకుతారూ? ఈ ప్రపంచం ఎటు పోతోందీ? కనీసం బెత్తెడు చోటు నా బోటివారికోసం ఉంచకుండా. ఆ స్థలంలో సైతం మరో షెడ్డు వేసేస్తున్నారు. సిమెంట్ పూసేస్తున్నారు!

''నాకెందుకు? అని నేను ఎందుకో అనుకోలేక పోతున్నాను. ఈ లోకం ఎటుపోతే నాకేం?'' అని నేను ఎందుకు ఆలోచించలేకపోతున్నామూ? బహుశా! నా వేర్లు వేరులో పాతుకుపోయిన ఉపకార గుణంవల్లనేమో!

## పడని చెట్లు



యూకలిప్టస్ చెట్టునుండి యూకలిప్టస్ ఆయిల్ తయారుచేస్తారు. యూకలిప్టస్ చెట్లుండే నేలమీద గడ్డిపోచకూడా మొలవదు. కారణం నేలమీద రాలిపడిన యూకలిప్టస్ ఆకుల్లోని ఒక రసాయన పదార్థం మట్టిలో కలిసి, గడ్డి మొలవకుండా చేస్తుంది. వాల్‌నట్ చెట్లుండే ప్రదేశంలో టొమాటో చెట్లుగానీ, ఆపిల్ చెట్లుగానీ బతకలేవు. వృక్షజాతుల్లో కొన్నిటిమధ్య ఈ విధమైన బద్ధవైరం కనిపిస్తుంది.

— దావులూరి సురేంద్రనాథ్

నేను మూగగా చూస్తూ నిలబడ్డాను. ఇంట్లోని వారందరూ తర్జనభర్జనలు పడ్డత రువాత, ఒక నిర్ణయానికొచ్చారు.

''నన్ను నరికించెయ్యడమే మంచిదని''

ఇంటివారి అల్లుడు నా కారణాన మావ గారింట్లో అడుగు పెట్టడం లేదుట! ఈ విషయం తెలిసిన తరువాత ఇంటివారమ్మా యి బైటికొచ్చినా, నేను మొహం చాటుచేసు కోవాలన్నంతగా పశ్చాత్తాపపడ్డాను.

''బాబు వచ్చాకా, సంగతి తెలిసి ఏమం టాడో?'' బామ్మగారు అనుమానం వ్యక్తం చేసింది.

నాకు చాలా ఊరటగా అన్పించిందామా ట!

''వాడి మొహం! ఈ కష్టాలన్నీ వాడికేం తెలుసు! వచ్చాక చెప్తాంలే!'' అని తీసిపారేసిన ట్లు మాట్లాడాడు యజమాని.

నేను దీర్ఘంగా నిట్టూర్చాను. ''పోనీలే, నా సుఖాలూ, దుఃఖాలూ అన్నీ ఈ ఇంటిలోనేగా పెనవేసుకున్నదీ, వాళ్లు సంతో షంగా వుంటే అంతకన్నా కావలసిందేవుందీ ?'' అని నన్ను నేను ఓదార్చుకున్నాను. కానీ నా దురదృష్టం. ఈ విషయంలో కూడా నేను వాళ్లని సంతోషపెట్టలేకపోయాను. నన్ను వదిలించుకోవడం వాళ్లకి అంత సులువు కాలేదు! నా వల్ల అనేకమైన చిక్కుల్లో పడ్డారు!

అదేమిటి? అని ఆశ్చర్యపోతున్నారా? అదీ చెప్తాను ఓపిగ్గా వినండి!

''చెడు అనేది ఊహించిని వేగంతో వ్యాప్తిచెంది, మంచిని మరుగు పరిచేస్తుంది''

అది నా విషయంలో నాకు స్వీయానుభ వమే! ప్రస్తుత పరిస్థితుల్లో అందరికీ నావం టి మీద పురుగులూ, వాటి తాలూకు మాగూ తప్ప, నా పూర్వపు మంచితనం గోచరించడంలేదు.

మనిషికి గతంకంటే వర్తమానం ముఖ్య ం! భవిష్యత్తంటే అంతులేని భయం!

ఓనాడు ప్రొద్దుటే ఇంటి యజమాని ఓ మనిషిని వెంట పెట్టుకుని వచ్చాడు. ఆ వచ్చిన వ్యక్తి పచ్చినెత్తురు తాగే కిరాతకుడిలా వున్నాడు. భుజంమీద గొడ్డలి వుంది, సంగతేమిటో నాకు అర్థమైపోయింది.

''మంచి చెట్టు. బోలెడు కట్టె వస్తుంది'' చెప్తున్నాడు యజమాని.

పోనీ, ఇప్పుడైనా నోరు తెరిచి నన్ను పొగుడుతున్నాడు. అన్న సంతృప్తితో నా కళ్లు చెమ్మగిల్లాయి.

''ఇవాళా, రేపూ వేపకట్టె మార్కెట్లో పోత లేదుసార్! కెట్ట కావాలంటే మవ్వే అమ్ముకో నాకు చెట్టు కొట్టినందుకు కూలి చ్చుకో'' అన్నాడు వాడు.

''ఎంతివ్వమంటావ్?''

''వెయ్యిచ్చుకో''

''అమ్మో! అంతెక్కడ్నించి తీసుకురా నూ!''

''కట్టెలమ్ముకో!''

''మరీ నేనే... అమ్ముకోవడమా!''

నాకు వళ్లు మండిపోయింది. మొన్నామ ధ్య కొడుకుని అమ్మకానికి పెట్టలేదూ! అంతకంటే తీసిపోయిందా?

ఇద్దరూ బేరసారాలు మొదలెట్టారు. వాటికి తుదీ మొదలూ లేకుండా సాగుతు

న్నాయి.

కొనఊపిరితో వున్నవాడిముందే, వాడి దహనం ఖర్చులగురించి వాదించుకున్నట్లు అనిపించింది నాకు.

చివరికి ఆరొందలకి బేరం కుదిరింది.

"అమ్మయ్యా!" అని ఊపిరి పీల్చుకున్నాను.

ఇంటి యజమాని అంత సంతోషంగా ఏమీ కనిపించలేదు నాకు. బహుశా నామీద బెంగ కావచ్చు అని ఊరట చెందాను.

"రేపు ప్రొద్దుటే రా!" అని వాడితో చెప్పాడు.

"రేపు ఒంటిగంట కొట్టేటప్పటికీ చెట్టు వుండదు సరేనా!" అన్నాడు వాడు ధీమాగా.

ఆయన సంతృప్తిగా తలూపేడు. అప్పుడు చివుక్కుమంది నా మనసు.

మరువాడు చాలా సేపటివరకూ ఎవరూ బైటికి రాలేదు. పొద్దెక్కాకా, ఇంటి యజమాని నా దగ్గరకొచ్చి నిలబడి, ఒక్కసారి క్రిందనుండి పైకి తేరిపార చూసాడు.


అవకాశం కోసం ఎదురు చూస్తున్న దానికి మల్లే కాకిపిల్ల ఆయనమీద రెట్టవేసేసింది. ఆ విధంగా దాని నిరసన అది వ్యక్తం చేసేసనట్లుంది!

"ఛీ ఛీ" అని చిరాకుపడ్తూ దూరం జరిగాడు.

నీళ్లతో నిండిన నా కళ్లు, ఒళ్లు ఒకసారి విదిలించి, చిరునవ్వు నవ్వబోయాను. ఎదురుగా కనిపించాడు. వాడే యముడిలా... భుజంమీద గొడ్డలితో... నా తలారి!

యజమాని ఎదురేగి తీసుకొచ్చి, "మొదలుపెట్టు" అన్నాడు.

వాడు నెమ్మదిగా భుజంమీదనుంచి గొడ్డలి తీసి గాల్లోకి లేపి... మొదటిదెబ్బ కొట్టాడు. అ...మ్మా... అంటూ దిక్కులు పిక్కటిల్లేలా ఎలుగెత్తి ఏడ్చాను. నా తల్లి



నిలువెల్లా బాధతో కంపించిపోయింది. కన్నబిడ్డని, కసాయివాడు నరికేస్తూంటే, ఏ తల్లి హృదయం కంపించిపోదూ! కానీ ఏమీ చేయలేని నిస్సహాయతతో, 'నీతోబాటే ఎంతోమంది పాపాత్ములని కూడా భరిస్తున్నానమ్మా! వాళ్లూ నా బిడ్డలే! కానీ బలవంతులు! మనం తలవంచక తప్పడంలేదు!'' అంటూ దుఃఖించింది.

మరో దెబ్బ వెయ్యడానికి... రెండవసారి గొడ్డలి ఎత్తాడు. అప్పుడు... చెలరేగింది. ఒక్కసారిగా పక్షుల్లో ఉద్రేకం! కలకలారావాలు చేస్తూ ప్రళయకాల ప్రభంజనాల్లా విరుచుకుపడ్డాయి వాడిమీద. వాడి తలని గోళ్లతో తన్నసాగాయి. నాకు జటాయువు గుర్తొచ్చి విరక్తిగా నవ్వుకున్నాను. ''ఉష్... ఉష్....'' అని వాడిని అదిలిస్తూ, వాడు రెండవ దెబ్బ కొట్టబోతుండగా.

''ఆగండి'' అన్న కేక వినిపించింది.

వారితోబాటు నేనూ ఉలిక్కిపడి చూశాను.

ఎదురుగా ఖాదర్ నిలబడి కనిపించాడు. బుగ్గమీద గాటూ, ఎర్రగళ్ల లుంగీ, నోట్లో పానూ వాడి ప్రత్యేక లక్షణాలు!

వాడిని చూడగానే ఇంటాయన పై ప్రాణాలు పైనే పోయాయి. కారణం వాడా పేటకి 'రౌడీ' కొట్టకుండా ఎవరితోనూ మాట్లాడడూ! పొడవకుండా ఏ పనీ సానుకూలంగా చేసుకోలేడూ!

''ఏమిటి ఖాదర్‌భాయ్?'' అన్నాడు ఆయన.

ఆ రౌడీ వెధవ నాకు సోదర సమానుడా అన్న విచక్షణ ఆ స్థితిలో ఆయనకు లేదు పాపం!

''బేవ్‌కూఫ్! చెట్టు కొట్టిపిస్తున్నావా? ఎవరికి అడిగి?'' అన్నాడు రౌద్రంగా.

''నాకు దానివల్ల ఇబ్బందిగా వుంది. అందుకే. అయినా అది నా ఇంట్లో చెట్టేగా!'' అన్నాడు నీరుకారిపోతూనే.

''ఏం దిమాక్ సరిగ్గా లేదా? ఇంత బడా చెట్టుకి మొదలు నీ ఇంట్లో వున్నదని కొట్టిపించేస్తావా?''

''మరి !!!'' తెల్లబోయాడాయన.

''తమాషా చేస్తున్నావ్! దీని కొమ్మలు గాడ నా మటన్‌షాప్‌దాకా వున్నాయ్. అవి నా షాప్‌మీద పడ్తే, ఆ లుక్సానంతా ఎవుడు బరాయిస్తాడు?'' మీదమీదకొస్తూ అన్నాడు.

''జాగ్రత్తగానే కొట్టిస్తాను ఖాదర్‌భాయ్'' అన్నాడు వెనక్కి వెనక్కి వస్తూ.

''ఏంది మళ్లా, అదే మాట''వాడు గుర్రున బొడ్లోంచి చాకు తీశాడు.

ఇంటాయన ఒక్క గెంతులో వరండా ఎక్కాడు.

''లేపేస్తా! నాతో పెట్టుకోకు, కబ్రస్తాన్‌లకూడా కబర్ లేకుండ చేస్తా!'' వాడు రెచ్చిపోయి 1రుస్తున్నాడు. ఈ గొడవకి బామ్మగారూ, అమ్మాయి బైటికొచ్చి నిలబడ్డారు.

''అయ్యో! అయ్యో! బిడ్డని చంపేస్తున్నాడు. రండి. రండి. ఒక్కరూ రారే!'' ముసలావిడ గగ్గోలు పెట్టసాగింది.

''ఏయ్! ఏవిటీ దౌర్జన్యం!'' ఇంటవారమ్మాయి కోపంగా అడిగింది.

''ఏయ్! ఏవిటీ దౌర్జన్యం!'' ఇంటవార

మ్మాయి కోపంగా అడిగింది.

వాడు తలతిప్పి అమ్మాయి వైపుచూశాడు. ఓలింత అందంతో మెరిసిపోతోంది. వెకిలిగా నవ్వి కన్నుగీటాడు.

ఆ అమ్మాయి మొహం అవమానంతో ఎర్రగా కందిపోయింది. గిరుక్కున వెనక్కి తిరిగి వెళ్లిపోయింది.

"బాబ్బాబూ! నీకు దండం పెడ్తాను. ఆ చాకు ముడిచెయ్!" ముసలావిడ ప్రాధేయపడింది.

"అయితే. నీ కొడుకులోతో చెప్పు 'బుడ్డీ! చెట్టు కొట్టేసినంక. ఆ కట్టెలంతా నాకే గావాల!"

"వెధవ కట్టెలకేం బాబూ! అలాగే తీసుకో" ఆవిడ వణికిపోతూ అంది.

వెధవ కట్టెలా? ఈ మాటకంటే ఆ గొడ్డలి దెబ్బే నయం అనిపించింది నాకు!

ఇంటాయన కంగారులో ఏమీ మాట్లాడలేకపోతున్నాడు. చివరికి ఇద్దరు ముగ్గురు గుంపుగా చేరి, నా కట్టెలన్నీ ఖాదర్‌కే ఇచ్చివేసేట్లు ఒప్పందం చేశారు.

నాకు బావురుమని ఏడవాలనిపించింది.

ఇంతలో "ఏంది? ఏమా లొల్లి?" అంటూ ఓ పోలీసు రంగప్రవేశం చేశాడు.

ఖాదర్ మెరుపువేగంతో చాకు లోపల దాచేసి, "చూడన్నా, చెట్టు కొట్టిపిస్తాడంట?" అన్నాడు.

"ఆ చెట్లు కొట్టిస్తే జైల్లో పెడ్తారని తెలియదా?" గద్దించాడు పోలీసు.

"ఏదోలే ఇడిసిపెట్టు! రెండొందలు ఇచ్చుకుంటాడు" తను మధ్యవర్తిత్వం నడిపేశాడు ఖాదర్.

"ఆ!" ఇంటాయనకి ఏమీ అర్థంకాని పరిస్థితి.

"రెండు వందలా?" పురుగుని దులపరించినట్లు దులపరించేశాడు పోలీసు.

"క్రీబాత్! చార్‌సౌ" చెప్పాడు తిరుగులే

## దోమలు

"ఏరా మీరుండేది ఎక్కడా?" ఒకతను మరో స్నేహితుణ్ణి అడిగాడు.

"చిలకలగూడ"

"నువ్వే నయరా!"

"ఏం?"

"ఏం లేదు. మేం వుండేది దోమలగూడలోనే!' అన్నాడు నిట్టూరుస్తూ మొదటివాడు.

— వి.మల్లికార్జునరావు (హైదరాబాద్)



నట్లుగా ఖాదర్.

"నాలుగువందలా? నేనివ్వాలా?" అంటూ ఇంటి యజమాని ఏదో అనబోతుండగా బామ్మగారు ఆయన్ని వెనక్కిలాగి "ఏమీ మాట్లాడకురా! అసలే పచ్చినెత్తురు తాగేవాళ్లు! నా మొహం చూసి ఊరుకో!" అంటూ లబలబలాడింది.

పోలీసు కాసేపు బెట్టుచేసి చివరికి ఒప్పుకున్నాడు.

ఈ గొడవంతా అయి ఇంటాయన తెప్పరిల్లేటప్పటికి సాయంత్రం అయింది.

"నేను రేపు పొద్దున్నే వస్తా సార్!" అని యముడు గొడ్డలి తీసుకుని నిష్క్రమించాడు.

నాకు క్రింద అయిన గాయంవల్లకంటే కూడా ఈ గొడవవల్ల ఎక్కువ బాధకలిగింది. నావల్ల చివరిగా ఒక్క సన్మార్గుడికి కూడా ఉపకారం జరగడం లేదే అన్నదే ఆ బాధ! దొంగలూ, దొంగలూ చేరి ఊళ్లు పంచుకుంటున్నట్లు, ఈ రౌడీ వెధవా, ఆ పోలీసుగూండా కలిసి ఎందుకు డబ్బు దండుకుంటున్నారో నాకు అర్థంకావడంలేదు. నిజానికి ఇద్దరిలో ఎవరికీ నామీద హక్కులేదు. హక్కులాంటిది ఏదైనా వుంటే అది నన్నింతకాలం పెంచిన ఇంటాయనకే వుంది. ఆయన అచేతనంగా పడక కుర్చీలో కూలబడ్డాడు.

లోపల్నుండి చంటి పిల్ల ఏడుపు వినిపిస్తోంది.

"అయ్యో దద్దుర్లు వచ్చేశాయాకన్నా! పాడు చెట్టు మనవి ఒకంతట వదిలేటట్లు లేదు" ఇంటివారమ్మాయి కోపంగా అంటోంది.

"ఛీ! చావడానికి కూడా ఇన్ని అవరోధాలా?" నా జన్మమీద నాకే చిరాకేసింది.

"ఈ గండం గడిచి గట్టెక్కితే, ఏడుకొండలూ నడిచి ఎక్కుదాం! తలనీలాలు సమర్పించుకుంటాను! ఆ ఖాదర్ వెధవని చూస్తేనే నా గుండె దడదడలాడిపోతోంది" అంటూ బామ్మగారి రాగం వినిపిస్తోంది.

కనీ, పెంచిన కొడుకుమీద ఎంత ప్రేమ! మరి నన్ను అదే చేత్తో పెంచిందికదా! గొడ్డలితో నరికేస్తుంటే ఏమీ అనిపించలేదా? మనుషులకి స్పందనలుంటాయంటారే! అది అబద్ధమా? చెట్లమీదా, పుట్టలమీదా, వెన్నెలమీదా కవిత్వాలు వ్రాస్తారట కవులు! వాటికీ ప్రాణం వుందని మనస్ఫూర్తిగా నమ్ముతారట!

నా ఆలోచనల్లో నేను వుండగా, ఇంటి ముందు బండి ఆగింది. అందులోంచి 'బాబు' ఇంటి యజమాని కొడుకు దిగాడు.

నాకు ఆశ్చర్యం, ఆనందం రెండూ కలిసి కలిగాయి. ఆఖరిచూపుకోసం నా మనసు కొట్టుకుపోతోంది.

ఎన్నోసార్లు గాలిపటాలు నా చిక్కుతలలో చిక్కుకుపోతే, లేతపాదాలలో నామీదుగా ఎక్కి వాటిని అందుకోబోయేవాడు. నాకు సాధ్యమైనంతగా తలవంచి అతనికి అందించేదాన్ని. దిగుతుంటే పడిపోకుండా పట్టుకునేదాన్ని.

అవన్నీ అతనికి జ్ఞాపకం వుంటాయా? రోజూ చూసేవారే మర్చిపోతున్నారు. ఇంక సంవత్సరానికి ఒకసారి చూసే అతడికేం

గుర్తుంటాయి? పైగా పురుగులతో, వాడిలి పోయిన ఆకులతో వున్న నా రూపం, ఎంత భయంకరంగా వుంది?

అతను దగ్గరవుతుంటే నా దుఃఖం ఎక్కువ కాజొచ్చింది. ఆశ్చర్యంగా వుందే! నాలో ఇంకా కన్నీళ్లు మిగిలి వుండడం?

"బాబు వచ్చాడు, బామ్మా! నాన్నా!" అంటూ అమ్మాయి ఆనందంగా అరిచింది.

బామ్మగారు "వచ్చావా నాయనా!" అంటూ ఏదో ఘోరం జరిగిపోయినట్లు ఏడుస్తూ ఎదురు వచ్చింది.

ఇంటి యజమాని మొహంలో కొడుకుని చూడగానే కాస్త వెలుగొచ్చింది.

"ఏవిటలా వున్నారూ?" అని అందర్నీ పలకరిస్తూ అతను నన్ను దాటాడు. దాటిన వాడు అంతలోనే గబుక్కున్న వెనక్కి తిరిగి "ఇదేమిటే?" అంటూ నాకు తగిలిన గొడ్డలి దెబ్బ చూస్తూ మోకాళ్లమీద కూర్చున్నాడు.

నా గాయం దగ్గర, తన అరచేత్తో స్పృశిస్తూ "నాన్నగారూ ఎవరిలా కొట్టారు?" అని అడిగాడు.

అతని చేయి తగలగానే నా జన్మ ధన్యమయిందన్న భావన కలిగింది నాకు. వృధాగా పోలేదు నా సేవలు! కనీసం ఒక్క మనిషి! ఒక్క మనిషి ఆ ఇంట్లో నాకోసం బాధపడ్తున్నాడు.

అంతేచాలు నా జన్మకి! అనిపించింది.

"లోపలికిరా! ముందు వివరంగా మాట్లాడుకోవచ్చు" అమ్మాయి పిలిచింది.

అతను కదిలి లోపలికి వెళ్లాడు.

మళ్లీ ఒక్కసారి వెనక్కి వచ్చి, కోతి కొమ్మచ్చులాడితే ఎంత బాగుండ్నూ! చిన్నప్పటిలా నా ఒంటిమీదికి ఎగబాకితే ఎంత హాయిగా వుంటుందీ?

అంతలోనే నా ప్రస్తుత స్థితి నా కళ్లముందు నిలిచి నన్ను అపహాస్యం చేసింది.

## వడగండ్ల వాన

మామూలుగా ఎండాకాలంలో కొన్ని ప్రదేశాలలో వడగండ్ల వాన పడుతుంటుంది. వాన చినుకు మంచుగడ్డగా మారడమే దానికి కారణం. ఆకాశంలో మేఘాలు బాగా చల్లబడడంవల్ల చినుకులు మంచు గడ్డలుగా మారతాయి. ఒక్కో మంచుగడ్డ ద్రాక్షపండు సైజులో వుంటుంది. వడగండ్ల వానవల్ల పొలాలకి ఘోరనష్టం వాటిల్లుతుంది.



— దావులూరి సురేంద్రనాథ్

కుప్పిరోగి సర్దొచ్చాడు! ఇదే ఇంట్లో ఓ మనిషికి జబ్బుచేస్తే, ఇలాగే వదిలేస్తారా? మందో మాకో ఇప్పించరా? చంపేసుకుంటారా?

ఏమో! చెప్పలేం. ఈ మధ్య మనుషులు అలాగే చేస్తున్నారట. వయసు పైబడి జవసత్వాలు ఉడగగానే, వృద్ధాశ్రమాలకో ఎక్కడికో పంపించేస్తున్నారట. మరి మాకలా వీలుకాదుగా!

ఆ రాత్రి...

అందరూ వసారాలో కూర్చుని నాగురించే మాట్లాడుకుంటున్నారు. నా వళ్లంతా చెవులు చేసుకుని వినసాగాను.

ఇలాగే అమ్మాయి ఈడేరిందనీ, అబ్బాయి పరీక్షలు పాసయ్యాడనీ, యజమానికి ప్రమోషన్ వచ్చిందనీ, బామ్మగారికి గుండె నొప్పి వచ్చి తగ్గిందనీ, ఎన్నో విషయాలు వారితో బాటు కలిసి వినడాన్నే, పంచుకోవడంగా అనుకుని ఆనందించాను ఇన్నేళ్లూ!

అలాగే! ఈ రోజూ మౌనంగా నిలబడి నా మరణశాసనాన్ని వినసాగాను.

''మన చెట్టు మనం కొట్టేసుకోవడానికి మధ్యన వీళ్లందరూ అడ్డం పడ్డారు ఎందుకు?'' అంటోంది అమ్మాయి.

''నేను కన్నాను కాబట్టి నేనే చంపేసుకుంటాను నా బిడ్డని'' అనడం అరణ్యన్యాయమమ్మా అని చెప్పాలనిపించింది. అందుకే భగవంతుడు మాకు నోరివ్వలేదనుకుంటా! ఇస్తే ఇలాగే చీటికీ మాటికీ కల్పించుకుని మాట్లాడుతూ వుంటాము. అన్నింటికీ మానవుడు మామీద ఆధారపడి బ్రతుకుతున్నాడన్న సత్యాన్ని ఎత్తి చూపిస్తాము. మా ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తాం! స్ట్రైక్‌లూ, రాస్తారోకోలూ చేస్తాం! ఈ సమస్య పార్లమెంట్‌లో నిత్యం రగులుస్తాం! మాకు 'కోర్టులూ' కొత్త కాన్స్టిట్యూషన్‌లూ నిర్మించుకుంటాము. అందుకే ఇవన్నీ ఆలోచించే ఆ దయామయుడు పశుపక్ష్యాదులకీ మాకూ నోరివ్వలేదు.

''చెట్టు కొట్టడానికి ఆరొందలు, కొట్టనిచ్చినందుకు పోలీసులకు నాలుగు వందలు, కొట్టాక వచ్చిన కట్టెలన్నీ ఆ రౌడీగాడు బండికెత్తించుకుని వెళ్లిపోయాక వీధివీధంతా శుభ్రం చేయించడానికి ఇంకో యాభయ్యో, వందో వదిలించుకోవాలి! ఇదెక్కడి న్యాయం!'' యజమాని వాపోయాడు.

నాకు గట్టిగా నవ్వి ఇలా చెప్పాలనిపించింది

''ఆడపిల్లను కనీ పెంచి వగాన్రటా చేయించి, ముద్దు ముచ్చటలు తీర్చి, యౌవనం రాగానే మరో ఇంటికి వెలుగుగా పంపుతారు తల్లిదండ్రులు. వారికి జీవితాంతం చాకిరి చెయ్యటానికీ, వారి వంశం ఉద్ధరించడానికీ పంపుతూకూడా, ఎదురు కట్నం ఇవ్వడంలేదా? అమ్మాయిచ్చే సౌఖ్యాల తోపాటు సంపదలుకూడా ఆశించే ఆ మగపిల్లలు తల్లిదండ్రులకీ, ఈ ఖాదర్‌లాంటి రౌడీలకీ ఏమిటి తేడా? ఇంతా చేసి, అమ్మాయి అక్కడ సుఖంగా నూరేళ్లకాలం గడుపుతుందని గట్టి నమ్మకం వుండదు! మరో మూడు నెలల్లోగా నూరేళ్లు నిండిపోవచ్చుకూడా! మరో అబల ఆత్మాహుతి అన్న చిన్న చిన్న అక్షరాలు ఆ అమ్మాయినిగూర్చి, వార్తాపత్రికలో ఓ మూల పడవన్న హామీ

ఏమీ లేదు! అంత గాల్లో దీపం పెట్టి 'దేవుడా నీవే దిక్కు' అనేలాంటి వ్యవహార మే!

మరి ఇక్కడ నా విషయంలో కూడా మనుష్య న్యాయమే జరుగుతోంది. అప్పుడు లేని బాధ ఇప్పుడెందుకూ? ఓహో! నావల్ల తనేమీ లబ్ధి పొందడంలేదనికదూ! ఒక్కసారి గా ఒళ్లంతా బిగించి, అస్సలు గాలి వీచకుం డా నిలబడ్డాను.

వేసవికాలం కాబట్టి విద్యుత్ కోత!

అమ్మాయి, 'అబ్బా!' అంటూ పమిట చెంగుతో విసురుకోసాగింది.

అబ్బాయి లేచి అటూ ఇటూ పచార్లు చెయ్యసాగాడు.


అతను చెప్పబోయే దానిమీదే నా జీవితం ఆధారపడి వుందన్నట్లు. బామ్మగారూ, ఇంటాయనా ఆత్రుతగా చూస్తున్నారు.

"ఎలాగో ఆరు నెలల్లో కొత్త ఫ్లాట్‌లోకి మారిపోతున్నారు. ఈ ఇల్లు అమ్మకానికి పెట్టేద్దాం! ఆ లోగా తొందరపడి ఈ నిర్ణయం తీసుకోవడం ఎందుకు? ఆ తరువా త ఇల్లు కొనుక్కున్నవాళ్లే ఏదో ఒకటి చేసుకుంటారు" అన్నాడు అబ్బాయి నావైపు చూస్తూ.

"వొద్దు. వొద్దు" అని అరవాలనిపించిం ది. ఈ కట్టె మీ చేతులమీదుగానే వెళ్లిపోవా లి. మళ్లీ కొత్త యజమానులా? నాకు భరించే శక్తి సన్నగిల్లింది. ఈ లోకం మీదే చెప్పలేనంత విరక్తి ఏర్పడింది. అంత శిక్ష వొద్దుబాబూ!" అని మూగగా రోదించాను.

"వాడు చెప్పిన మాట బానే వుందిరా" అంది బామ్మగారు.

"అచ్చి వచ్చిన చెట్టురా! పిల్లలు ఆ నీడనే పెరిగి ప్రయోజకులయ్యారు. మా వూరు 'రామచంద్రాపురం'నుండి తెచ్చిన మొక్క ఆ వారగా వేశాము. పెరిగి ఇంతదైంది" ఏదో తెర గొంతుకు అడ్డం పడినట్లయి, ఆమె



గొంతు వణికింది కళ్లు చెమ్మగిల్లాయి.

ఆవిడ. పుట్టింటికి, ఆవిడకీ మధ్య అనుబంధపు వారధిగా ఆ నిమిషాన నా ఒళ్లు పరవశించింది. తిరిగి రెట్టించిన ఉత్సాహం తో గాలి వీచసాగాను.

వయసు పైబడిపోవడంవలన 'కిర్ కిర్' మన్న కొమ్మల చప్పుడు నాకే ఎబ్బెట్టుగా విన్పించసాగింది.

"దాని నీడన మంచం వేసుకుని పడుకుంటే, ఎంతో ప్రశాంతంగా వుండేది. సరిగ్గా ఏడాదినుంచి ఈ పురుగుల బెడద పట్టుకుంది" ఇంటి యజమాని గొంతులో ఆవేదన.

ఆయన మనోభావాలకీ, మూగవేదనలకీ ప్రత్యక్షసాక్షిగా నిలబడ్డ నన్ను ఆర్తిగా చూశాడు. ఆ చూపు తిరిగి నాకు జీవితంపై ఆశ చిగురించేట్లుగా చేసింది.

"నాకు మాత్రం దాన్ని కొట్టివేయడం ఇష్టమా? ఆ బాధలు పడలేకకానీ, మావారు పసిపిల్లవాడితో ఆ ఇంట్లో ఒక్క రోజుకూడా వుండడానికి వీల్లేదు, చెట్టు కొట్టిస్తారో లేదో కనుక్కో, కొట్టిస్తేనే వుండు! అని కబురు చేశారు కాబట్టి" తన ఆవేదన వ్యక్తం చేసింది అమ్మాయి. చాలా రోజుల తరువాత నావైపు తల తిప్పి చూసింది. ఆ పెద్ద పెద్ద కళ్ల మాటున దాగిన కన్నీటి తెర నన్ను కట్టిపడవేసింది.

ఈ నీడలోనే కూర్చుని ఆ అమ్మాయి తనకు కాబోయే భర్తతో మొదటిసారిగా మాట్లాడింది.

ఆషాఢమాసంలో మొదటి ప్రేమలేఖ వ్రాసింది. నా నీడలో ఆగి, గంట గణగణలాడించే పోస్ట్‌మేన్‌కోసం ఒళ్లంతా కళ్లు చేసుకుని ఎదురుచూసేది.

కొత్త జంట చెప్పుకునే శృంగారపు ముచ్చట్లూ, తొలి మాతృత్వపు సూచనలు పొడసూపగానే పొందిన తన్మయత్వం, అన్నీ నా సమక్షంలోనే గడిచిపోయాయి.

బిడ్డని కన్న తరువాత భర్తనే దూరం పెడుతుంది స్త్రీ. ఇంక నేనెంత? అని సమర్ధించుకున్నాను. ఆ క్షణంలో, నా వల్ల తన బిడ్డ బాధపడకూడదన్న ఆ తల్లి హృదయపు తపన తెలుసుకున్నట్లు గంభీరంగా తల వూపాను.

అమ్మాయి కృతజ్ఞతగా చూసి తల వాల్చుకుంది!

"రేపు ఆ చెట్టు కొట్టేవాడొస్తే చెప్పేయండి. మేము మా ఉద్దేశం మార్చుకున్నామని అన్నాడు చివరిగా అబ్బాయి.

నేను నిర్వేదంగా మారాను. మోక్షం చేతికంటూ వచ్చి తప్పిపోయిన రుషిలా చూశాను.

అందరికీ వారి మనసుల్లో నా పట్ల సానుభూతి వుంది. నా సేవలపట్ల కృతజ్ఞత వుంది. అన్నిటినీ మించి అనుబంధం వుంది! ఇంతకంటే ఈ మొండి బ్రతుక్కి ఏం కావాలి? నా జీవితం నా చేతిలో లేదు! కావాలనుకున్నప్పుడు జీవించలేను. అక్కర్లేదనుకున్నప్పుడు మరణించలేను. 'చచ్చిపో' అన్నారు. మౌనంగా తల వంచనూ లేదు. 'తిరిగి జీవించు' అన్నారు. మౌనంగానే అంగీకరించాను.

ఆ రాత్రి వాళ్లు నిశ్చింతగా నిద్రపోయారు. బహుశా! ఈ సమస్య వచ్చిన తరువాత

ఇంత నిశ్చింతగా వాళ్లు నిద్రపోయి వుండరు. అంతర్గతంగా ఏదో తప్పు చేస్తున్న భావన వాళ్లలో దాగి వుండేదనుకుంటా!

మామూలుగానే తెల్లవారింది!

అందరికీ అది మరో రోజు మాత్రమే! కానీ అది నాకు మరో జీవితం! అనుకోగానే ఒళ్లు గగుర్పొడిచింది.

అబ్బాయి పేపర్ చదువుతూ ఇటే వస్తున్నాడు.

"ఆ చెట్టు క్రిందికి వెళ్లకు. గొంగళి పురుగులు మీదడ్తాయి" అమ్మాయి వెనకనుంచి అరిచింది.

నా గాయం తిరిగి కెలిగినట్లయింది. ఏమీ పట్టించుకోని బదనిక వెకిలిగా నవ్వుతోంది. అది చూడడానికి నాకన్నా అందమైనది. కానీ హృదయ సౌందర్యం లేదు! మనసు వికృతం! సిగ్గులేని జన్మ! అందుకే ఆ పురుగులతో చెలిమి చేసింది!

అబ్బాయి వెనక్కి వెళ్లిపోయాడు. కాసేపట్లో అతను వచ్చాడు! అదే నా పాలిటి యముడు!

వంగిపోతున్న నా వెన్నువి నిటారుగా చేసుకుని, అతనివైపు చూపి శక్తికొలదీ పగలబడి నవ్వాలనుకున్నాను. కానీ చేతకాలేదు!

గొడ్డలి నా మొదలుకి ఆనించి పెట్టి "అయ్యగారూ పని మొదలుపెట్టనా?" అని అడిగాడు.

యజమాని వస్తూనే "అక్కర్లేదయ్యా! రాత్రి మా అబ్బాయి వచ్చాడు. నిన్న జరిగిన గొడవంతా విని, చెట్టు కొట్టించడం మానెయ్యమంటున్నాడు" అన్నాడు. వాడు చాలా కోపంగా చూశాడు. మరి నాతో ఎందుకు బేరం కుదుర్చుకున్నావ్?" అన్నాడు. "ఒకసారి ఒప్పుకున్నాక తప్పదు అంతే!" అన్నట్లు ముఖంపెట్టి.

'గాట్' ఒప్పందంపై సంతకం పెట్టబో

## పాపం

"అదేమిటయ్యా అలా డ్రయినేజీలోకి దూకావు?" లేవదీస్తూ అడిగాడు కనకారావ్.

"ఏం చేయమంటారు? సిటీ బస్ ఇక్కడే ఆపాడు మరి" అన్నాడు పావక్రావ్.

— వి.మల్లికార్జునరావు (హైదరాబాద్)



యే ముందు ప్రధానమంత్రి ఇబ్బంది పడ్తున్నట్లు, ఇబ్బంది పడ్తున్న తండ్రిని చూసి అబ్బాయి సమస్యని తన చేతుల్లోకి తీసుకున్నాడు.

''అప్పుడు అనుకున్నాం! ఇప్పుడు వద్దను కుంటున్నాం! ఇందులో గొడవేముంది? ఈ పదీ తీసుకు వెళ్లు'' అని అరిచి పది రూపాయలు చేతిలో పెట్టాడు.

వాడది తీసుకోకుండా ఉరిమి చూస్తూ ''అంతా మీ ఇష్టమేనా?'' అంటూ విసవిసా నడుచుకుంటూ వెళ్లిపోయాడు.

''అమ్మయ్యా!'' అని అందరూ ఊపిరి పీల్చుకున్నారు. నేనుకూడా పీల్చుకోబోయాను. వాళ్లొదిలిన బొగ్గుపులుసువాయువుని కానీ ఇంతలో భయంకరమైన విస్ఫోటనం జరిగినంత చప్పుడుతో తలుపు తోసుకుంటూ ఖాదర్ వచ్చేశాడు. సారా వాసన గుప్పుమంది!

వస్తూనే అబ్బాయి కాలర్ పట్టుకుని ''ఏంది? చెట్టు కొట్టిపిస్తలేవంట'' అన్నాడు. తరువాత వరుసగా బూతులు తోసుకుని రాసాగాయి వాడి నోటినుండి.

''నిన్న నువ్వు కొటట్టిపించద్దన్నావుగా! ఖాదర్‌భాయ్' అన్నాడు యజమాని అడ్డం వస్తూ.

''ఔ! అన్నా కానీ మాట ముచ్చటైందిక దా! కట్టెలు బేరంపెట్టి బయానా కూడా తీసుకున్నా! ఇప్పుడు కాదంటావ్? ఎంత హిమ్మత్? అన్నాడు రెచ్చిపోతూ.

జనం చుట్టూ మూగి వినోదం చూడసాగారు.

పోలీస్ ఎవరో కబురు పెట్టినట్లే వచ్చాడు.

''చెట్లు కొట్టడం నేరం అని మీరు అన్నారుగా!'' యజమాని గొంతు వణికింది.

''అప్పుడు నువ్వు ఇన్నావా? ఖాదర్‌తో పెట్టుకోకు! మర్డర్లయిపోతయ్'' శాంతిభద్రతలు కాపాడాల్సిన బాధ్యత తనమీద వుందికాబట్టి చెప్పినట్లు చెప్పాడు.

అబ్బాయి నోరు విప్పబోతే,

''ఎన్‌కౌంటర్'' అయిపోతది జాగ్రత్త!'

వేలుచూపించి బెదిరించాడు!

ఖాదర్. ఇంక వీరంగం ఎత్తేసాడు. కస్సున బొడ్లోంచి కత్తి తీశాడు. ''చెట్లో మీరో ఎవర్నో ఒకళ్లని నరకడం తప్పదు!'' అని తేల్చేశాడు.

బామ్మగారు గోడుగోడున ఏడుస్తూ వెధవ చెట్టుకోసం ప్రాణాలొదులుకుంటారా? పోనియ్యండిరా! వాళ్ల చిత్తం వచ్చినట్లే చేసుకోనివ్వండి'' అంటోంది.

ఈ గొడవకి అమ్మాయి స్పృహతప్పింది.

ఇరుగూ పొరుగూ శుశ్రూష చేయసాగారు.

ఏమీ తెలియని పసిపాప అమాయకమైన కళ్లతో నన్ను, గొడవనీ వీక్షిస్తోంది!

నాకు మాట్లాడానికి సమ ఉజ్జీ దొరికినట్లు అనిపించింది. ''చూడమ్మా లోకం! ఎవరిదో జీవితంకోసం ఎవరో కొట్లకుక్కల్లా పోట్లాడుకుంటున్నారు. ఈ వివాదం వాడుకుని, రాజకీయంగా బలపడిపోవడానికి ఏ నాయకుడో ముక్కుదూర్చినా ఆశ్చర్యపడాల్సిందేమీలేదు. ఇవేళ నాకు జరుగుతోంది.

రేపు మీకూ ఇంతే! మీ తరాన్ని తల్చుకుంటే నా గుండెలువిసిపోతున్నాయి. త్వరగా ఆ దారుణాలేవీ చూడకముందే నా తనువు చాలించాలనుకుంటున్నాను! మనిషి రక్తం, మాంసం కిలోల లెక్కన వాడు బ్రతికి వుండగానే బేరం కుదుర్చుకునే రోజు దూరంలో లేదమామ!

మరో బుద్ధుడూ, సీతా ఈ పవిత్రావనిలో ఉద్భవించరు! ఎందుకంటే, కూర్చోవడానికి బోధిచెట్లూ, అశోకవృక్షాలు వుండవుగా!

నా ఉనికిని మాయం చేస్తున్నాడు. తద్వారా తన అస్థిత్వాన్నే తను పోగొట్టుకుంటున్నాడు. నేను తన చేతిలో వున్నానన్న తలంపులో నన్ను నిర్మూలిస్తున్నాడు. కానీ, తను నా చేతిలో ఎంతగా చిక్కుకుపోయాడో తెలుసుకోలేకపోతున్నాడు.

''అశోకుడు చెట్లు నాటించెను'' అని చదువుకునే పిల్లలు ''మమ్మీ చెట్లంటే ఏమిటి?'' అని అడిగేరోజు యుగాంతానికి నాంది పలుకుతుంది.

ఇందతా దుగ్ధకొద్దీ అనడంలేదు! మీ భవిష్యత్తు గురించిన ఆవేదనతో అంటున్నాను. చిన్నారి తల్లీ! నువ్వు పెద్దయ్యేసరికి కృత్రిమ గాలీ, ఆహారం, కాంక్రీట్ వనాలు తప్ప నీకు ఏమీ మిగల్చడంలేదమ్మా ఈ సమాజం! అదే నా గుండె కోసేస్తోంది.

''ఊ... కానియ్యండి, అమాయకులమీదా, అర్భకులమీదా ఎప్పుడూ బలవంతులదేగా పైచేయి. నా యజమానిని విడిచిపెట్టండి. నన్ను నరకండి. మీ పైశాచికత్వానికి ఈ చర్యద్వారా కాస్త సంతృప్తి లభిస్తే మరొకరు మీలోని ఈ వికృత రాక్షసికి బలికాకుండా వుంటే అంతకన్నా నా జన్మకు సార్థకత ఏమిటి? కానివ్వండి'' అన్నాను.

మొదటగా కొమ్మలు నరకసాగారు. అమాయకు హాహాకారాల్లా పిట్టలన్నీ చెల్లాచెదురైపోయాయి. గుండెలు చెరువులయ్యేట్లు

## అంటార్కిటికా పక్షి

అంటార్కిటికాలో నివసించే ప్రెటెల్ పక్షి ఒకే ఒక గుడ్డు పెడుతుంది. ఆ గుడ్డుపైన తల్లిపక్షి పదిలంగా కూచుని తీవ్రమైన మంచు, చలిలోకూడా చలించక గుడ్డును పొదుగుతుంది. తండ్రిపక్షి ఆహారాన్ని వెదికి తెచ్చి తల్లిపక్షికి తినిపిస్తుంది. గుడ్డునుండి పిల్ల బైటకొచ్చేటంతవరకూ తండ్రిపక్షికు కునుకుపట్టదు.



— దావులూరి సురేంద్ర

రోదించసాగాయి.

అప్పుడు నావైపు చూసింది బదనిక! చిరునవ్వుతో! "నా తప్పులేదు నేస్తం! నన్ను, నిన్ను ఆ గొంగళి పురుగులనీ సృష్టించినవాడు వాడే! పరమాత్మ! చంపేదీ, చంపించేదీ కూడా వాడే! అని గీతలో వినలేదా? ఉపకారం చెయ్యడమే నీకు ఆ ప్రభువు నిర్దేశించిన విధి. తిరిగి ప్రత్యుపకారం చెయ్యలేని అశక్తులకే చెయ్యి అని బైబిల్‌లో బోధించలేదా? నేను నీనుండి ఆహారం, నీరూ, గాలితోపాటు జ్ఞానంకూడా కొద్దో గొప్పో పీల్చేసుకున్నాను. అందుకే... ఇలా... ఇదంతే!" అంటూనే నేలకూలింది. నా కళ్లు తెరుచుకున్నాయి. ఎంతో జ్ఞానివని విర్రవీగాను. కానీ, నా స్థిరత్వంలో తన అస్థిత్వాన్ని ఏర్పరచుకున్న ఆ బలహీనపు బదనిక నాకన్నా గొప్పది. ఎంత చక్కగా జీవన సత్యాన్ని విశ్లేషించిందీ? ఇన్నాళ్లా దానిని ఎంతగా తూలనాడానూ! నా గొప్పతనం దానివల్ల పోతోందని మదనపడ్డాను. అంటే నాగురించీ, నా సేవలగురించి అందరూ గొప్పగా చెప్పుకోవాలనే స్వార్థం నాలో వుండబట్టేకదా! కానీ అదికూడా లేని నిస్వార్థ జీవి అది. తనని అందరూ అసహ్యించుకుంటున్నా, గొంగళీలకు చివరివరకూ ఆశ్రయం ఇచ్చి, ఒకేలాంటి ఆదరణ చూపింది. ఆ భగవంతుడి సృష్టేనన్న నమ్మకంతో. నేను విని విర్రవీగిన గీతనీ, బైబిల్‌నీ అది అర్థం చేసుకుని ఆచరించింది.

అదే గొంగళీలు రేపటిరోజున సీతాకోకచిలుకలై ఎగిరితే అందరితోపాటు నేనూ ఆహా ఓహో అనేదాన్నేమో. మనుష్యులకి దగ్గరగా వుండి, వుండి నాలోనూ అవే లక్షణాలు చోటుచేసుకున్నాయి. "అమ్మో!" అంతకు మించిన శిక్ష లేదు. నాకు నిర్యాణం కావాలి. నరకండి! చంపండి!" అని ఎలుగెత్తి అరవసాగాను.

ఎత్తిన గొడ్డలి ఎత్తినట్లే ఆగిపోయింది.

"నేను నా మోక్షదాతవైపు పరమ భక్తిగా చూస్తున్నాను.

ఎవరో మంత్రిగారి గొంతు మైక్‌లోంచి వినిపిస్తోంది.

"చెట్లు నరకడం నేరం! భయంకరమైన పాపం! ఆపెయ్యండి ఆపెయ్యండి! ఎలక్షన్లొస్తున్నాయ్. ఆపెయ్యండి. ప్రకృతినీ, ప్రజల్నీ కాపాడాల్సిన బాధ్యత నామీద వుంది. కాబట్టీ..."

పోలీసులు హడావుడిగా వచ్చి విజిల్స్ బైటికి తీసి ఊదుతూ, లాఠీలతో గుంపుగా వున్న జనాన్ని చెదరగొట్టసాగారు.

మా కొమ్మలతోనే బ్యానర్లు తయారుచేసి, కట్టుంటే నాకు నవ్వొచ్చింది. 'పర్యావరణోత్సవాలు', 'ఫలానా మంత్రిగారి ఆగమనం' అని ఖాదర్‌లాంటి రౌడీలు ఖద్దర్‌లు కట్టి హడావుడిగా తిరుగుతన్నారు.

నన్ను చంపడానికి లంచం తీసుకున్న పోలీసులు లాంటివారు మంత్రిగారికి అటూ ఇటూ నడుస్తున్నారు.

తలా, కొమ్మలు నరకబడి మొండిగా వున్న నన్ను నేను చూసుకుంటున్నా గర్వంగానే అన్పించింది. తల పైకెత్తి కన్పించని ఆ సృష్టికర్తని వేడుకున్నాను "మరో జన్మలో కూడా మానుగానే పుట్టనీ, మనిషిగా వద్దు భగవాన్!" అని.